సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14+4 వెల: ₹ 5.5
శనివారం 8-7-2023



## చేపల వేటకు అత్యాధునిక టెక్నాలజీ

ఏపీ నుంచే శ్రీకారం చుట్టనున్నట్లు కేంద్ర మంత్రి రిజిజు వెల్లడి

8 లో

కేంద్రమంత్రి కిరణ్ రిజిజుకు జ్ఞాపికను అందజేస్తున్న సీఎం జగన్. చిత్రంలో ఎంపీ బాలశౌరి

# చేపల వేటకు అత్యాధునిక టెక్నాలజీ

- సముద్రంలో చేపల సమాచారం శాటిలైట్ ద్వారా మత్స్యకారులకు
- ఈ కార్యక్రమానికి ఆంధ్రప్రదేశ్ నుంచి శ్రీకారం
- ఆక్వా రంగంలో ఏపీదే అగ్రస్థానం
- విలేకరుల సమావేశంలో కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

**సాక్షి, అమరావతి:** సముద్రంలో చేపలు ఎప్పుడు, ఎక్కడ లభ్యమవుతాయన్న సమాచారం మత్స్యకారులకు అందుబాటులోకి తీసుకొస్తున్నట్లు, దీని కోసం అత్యాధునిక టెక్నాలజీతో కూడిన శాటిలైట్ వినియోగిస్తున్నట్లు కేంద్ర భూ విజ్ఞాన శాఖ మంత్రి కిరణ్ రిజిజు చెప్పారు. ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ నుంచి మొదలు పెట్టామని తెలిపారు. ఇందుకు రాష్ట్ర ప్రభుత్వం నుంచి పూర్తి సహకారం ఉందని చెప్పారు. శుక్రవారం విజయవాడలోని బీజేపీ రాష్ట్ర కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. మత్స్యకారులతో సమావేశం అయ్యేందుకు ఇక్కడకు వచ్చానని, మచిలీపట్నంలో మత్స్యకారులతో సమావేశమయ్యానని చెప్పారు. ప్రకృతి వైపరీత్యాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు మత్స్యకారులకు సకాలంలో సమాచారం అందించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. సముద్రంలో మత్స్య సంపద ఎక్కడ ఉందనేది కనుగొనడం కష్టమని, టెక్నాలజీ సహకారంతో ఆ మత్స్య సంపద ఎక్కడ ఎక్కువగా ఉందనేది కచ్చితత్వంతో తెలుసుకోవచ్చన్నారు. ఆ సమాచారాన్ని వేటకు వెళ్లేవారికి ముందుగానే తెలుపుతామన్నారు. ఇప్పుడు తీసుకొస్తున్న ఈ టెక్నాలజీపై మత్స్యకారులకు అవగాహన కోసం సమావేశాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. 'ఆంధ్రప్రదేశ్‌కు సుదీర్ఘ తీర ప్రాంతం ఉంది. ఆక్వా రంగంలో దేశంలోనే ఏపీది మొదటి స్థానం. అందువల్ల మత్స్యకారులకు సాంకేతిక సహకారం అందజేసే కార్యక్రమం ఏపీ నుంచే ప్రారంభించాం. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఉమ్మడిగా ఈ కార్యక్రమాన్ని చేపట్టాయి' అని వివరించారు. ప్రస్తుతం ప్రపంచం ఐదో ఆర్థిక శక్తిగా ఉన్న భారత్.. మూడో స్థానానికి చేరుకోవాలని లక్ష్యంగా పెట్టుకుందని, ఆ లక్ష్య సాధనకు ఆక్వా రంగ ఎగుమతులు అత్యంత కీలకమని రిజిజు చెప్పారు. రాష్ట్ర పర్యటన సందర్భంగా ఇక్కడి బీజేపీ కుటుంబసభ్యులను కలవడానికి రాష్ట్ర పార్టీ కార్యాలయానికి వచ్చినట్టు వివరించారు. విలేకరుల సమావేశంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు పీవీఎన్ మాధవ్, వేటుకూరి సూర్యనారాయణ రాజు, రాష్ట్ర క్రమశిక్షణ సంఘం చైర్మన్ పాకా వెంకట సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

### సీఎం జగన్‌ను కలిసిన కేంద్ర మంత్రి కిరణ్ రిజిజు

**సాక్షి, అమరావతి:** ముఖ్యమంత్రి నివాసంలో సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కేంద్ర భూవిజ్ఞాన శాఖ మంత్రి కిరణ్ రిజిజు శుక్రవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో మచిలీపట్నం ఎంపీ వి. బాలశౌరి పాల్గొన్నారు.